# బీఆర్‌ఎస్‌ది జనరంజక మేనిఫెస్టో..



కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

- విపక్షాల దిమ్మ తిరిగింది..
- కడియంకు భారీ మెజార్టీ ఖాయం..
- జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి

లింగాలఘనపురం, అక్టోబర్ 15 : బీఆర్‌ఎస్‌ది జనరంజక మేనిఫెస్టోఅని..విపక్షాలకు దిమ్మతిరిగిందని జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆదేశంతో మండలంలో ఆదివారం జడ్పీటీసీ పలు గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్తపెల్లిలో సర్పంచ్ తుంగ స్రవంతీ నాగరాజు అధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గర్వంధుల ప్రభాకర్, మెంతన అంజయ్య నేతృత్వంలో 40 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి జడ్పీటీసీ గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ. 6వేలు, ఇతరులకు రూ. 5 వేలు అంచెలవారిగా ఇస్తానడం అభినందనీయమన్నారు. గృహిణులు, పాత్రికేయులకు రూ, 400కే గ్యాస్ సిలిండర్ ప్రకటించడం అద్భుతమన్నారు. కడియం శ్రీహరి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. కార్యకర్తలంతా అవిశ్రాతంగా శ్రమించి శ్రీహరిని గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుక ఇవ్వాలన్నారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్ గౌడ్, విండో అధ్యక్షుడు మల్గ శ్రీశైలం, బుషిగంపల ఉపేందర్, నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, మర్రి భాస్కర్‌రెడ్డి, మార్పు శ్రీనివాస్‌రెడ్డి, మీసాల కృష్ణ, కృష్ణారెడ్డి, వెంకన్న, చౌదరపెల్లి విజయా భాస్కర్, బుషిగంపల ఆంజనేయులు, కొత్తకొండ గంగాధర్, తుంగ నాగరాజు, గాదెపాక విష్ణు, బూత్ కమిటీల నియామకంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గవ్వల మల్లేశం, మాజీ అధ్యక్షుడు దుంబాల భాస్కర్‌రెడ్డి, ఏదునూరి వీరన్న, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోకల శంకరయ్య, గంగసాని రంజిత్ రెడ్డి, నాయకులు రాపోలు శ్రీనివాస్, కత్తుల శ్రీపాల్‌రెడ్డి, ఎడ్ల రాజు, గువ్వల రవి, కాటం కుమారస్వామి పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ శ్రేణుల మంతనాలు ?

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15: స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థిగా సింగపురం ఇందిరను అధిష్టానం ప్రకటించడంతో కాంగ్రెస్ ముఖ్య శ్రేణులు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి టికెట్ అశించి దరఖాస్తు చేసుకుని టికెట్ రాని కొందరు ముఖ్య నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. సింగపురం ఇందిర కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవడం లేదని, దీంతో నిరాశ చెందిన స్టేషన్ ఘన్‌పూర్, చాగల్లు, తాటికొండ, మీదికొండ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు రెండు, మూడు రోజుల్లో బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు తెలిసింది.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15: మండలంలోని తానేధార్‌పల్లి గ్రామానికి చెందిన చాగంటి రాజు (30) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వం నుంచి ఆదుకుంటామన్నారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు కంసాని రాజిరెడ్డి, మాజీ అధ్యక్షుడు మంతెన ధర్మారెడ్డి, గాదె పురుషోత్తం, మార్కెట్ మాజీ డైరెక్టర్ మాచర్ల రఘురాములు, యూత్ మండల కార్యదర్శి గుండె రంజిత్, మాచర్ల హరీశ్, మాచర్ల రంజిత్, కొలిపాక కొంరయ్య, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15 : మండలంలోని చాగల్లులో అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న రహీం పాషా వద్ద నుంచి రూ. 6,630 విలువైన మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. అనుమతి లేకుండా మద్యం విక్రయించొద్దన్నారు. నిబంధనలు అతిక్రమించొద్దని హెచ్చరించారు.

## మహిళా సిబ్బంది ఐదు పోలింగ్ బూత్‌లు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఐదు మహిళా సిబ్బంది (ఉమెన్ మేనేజ్డ్) పోలింగ్ బూ త్ ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని చిల్పూర్ మండలం చిన్నపెండ్యాలలోని 106 పోలింగ్ బూత్‌లో 478 మహి ళా ఓటర్లు, జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటలోని 180 పీఎస్‌లో 383 మంది, ధర్మసాగర్ మండంలోని 35 పీఎస్‌లో 459 మంది, రఘునాథపల్లి మండలంలోని 192 పీఎస్‌లో 599 మంది, లింగాలఘన్‌పూర్ మండలంలోని కళ్లెంలోని 202 పీఎస్‌లో 481మంది మహిళా ఓటర్లు ఉండగా ఆ బూతులల్లో మహిళా అధికారులు విధులు నిర్వహించనున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం చాగల్లు గ్రామంలోని 151 పీఎస్‌లో 14 మంది దివ్యాంగులు ఉండగా అందులో దివ్యాంగ ఉద్యోగులే ఎన్నికల విధులు నిర్వహిస్తారన్నారు. అలాగే రఘునాథపల్లి మండలం మండెలగూడెంలోని 131, ధర్మసాగర్ మండలం సాయిపేటలోని 85, చిల్పూర్ మండలం రాజవరంలోని 75, జఫర్‌గఢ్ మండలంలోని 245, లింగాలఘన్‌పూర్ మండలం కుందారంలోని 268 పోలింగ్ బూత్‌ను మోడల్ పోలింగ్ స్టేషన్లుగా ఏర్పాటు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలోని 154 పోలింగ్ బూత్‌ను యూత్ మేనేజ్డ్ పోలింగ్ బూత్‌గా ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## ఎన్నికల్లో బూత్ కమిటీలదే కీలకపాత్ర

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15: అభ్యర్థి విజయంలో బూత్ కమిటీలదే కీలకపాత్ర ఉంటుందని ఇప్పగూడం కస్టర్ ఇన్‌చార్జి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బెలిదె వెంకన్న అన్నారు. ఆదివారం మండలంలోని వెంకన్న అధ్యక్షతన ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపల్లిగూడెం, సముద్రాల తానేధార్‌పల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో సమావేశాలు నిర్వహించి బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రతిరోజూ కలిసి రాష్టర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అలాగే ఈ నెల 16న జరిగే కేసీఆర్ సభకు తమ పరిధిలో ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శైలజా అజయ్‌రెడ్డి, ఆర్బీఎస్ సభ్యుడు తోట వెంకన్న, సర్పంచ్ గూడెల్లి అశోక్, మాజీ సర్పంచ్ తాటికొండ కుమారస్వామి, ఉప సర్పంచ్ ఇమ్మడి హరిప్రసాద్, పల్లె రవీంద, దైద ఎలిషన్, ఎన్నకూస రాంనర్సయ్య, మాచర్ల కుమారస్వామి, సట్ల యాకయ్య, యార రమేశ్, కొంకటి రమేశ్, కోమటిగూడెం గ్రామశా అధ్యక్షుడు బోయిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి

రఘునాథపల్లి, అక్టోబర్ 15: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వారాల రమేశ్‌యాదవ్, మండల కోఆర్డినేటర్ నామాల బుచ్చయ్య అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. మండలంలోని మండెలగూడెం, గబ్బెట గ్రామాల్లో నిర్వహించిన బూత్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించి కాంగ్రెస్, బీజేపీ ఎత్తులను చిత్తు చేయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అనుగుణంగా మేనిఫేస్టోను విడుదల చేశారన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరికే సాధ్యమవుతుందని, అందుకే కారు గుర్తుకే ఓటు వేసి కడియంను లక్ష మెజార్టీతో గెలిపించి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉత్తెపు ఉమా సత్యానారాయణ, చింతల బాలకృష్ణ, గుడి రాంరెడ్డి, గాదె సిద్ధేశ్వర్, నాగేశ్, కొంరయ్య, మోహన్, యాకూబ్, ఆకుల వినోద, నరేశ్, బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.



మండెలగూడెంలో మాట్లాడుతున్న నామాల బుచ్చయ్య



పోలింగ్ బూత్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్, ఘన్‌పూర్‌తో పాటు శివునిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీసం ఒక్క ఫీట్ ఎత్తున ర్యాంపులను ఆరు ఫీట్ల స్లోప్ ఉండేలా చూసుకోవాలన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వీ రామ్మూర్తి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ రాజేశ్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.

## మహిళలను గౌరవించేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే



స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 15: మహిళలకు పలు పథకాలు అమలు చేస్తూ గౌరవమిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం ఒక్కటే . డెలివరైన వారికి కేసీఆర్ కిట్, 13 వేలు, కల్యాణలక్ష్మి ద్వారా రూ. లక్షా 116, ఒంటరి మహిళ, బీడి కార్మికులకు పింఛన్ అందిస్తున్నాడు. అర్హులైన మహిళలకు జీవనభృతి పథకం ద్వారా నెలకు రూ.3వేలు అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషంగా ఉంది. కొడుకులు, బిడ్డల కోసం ఎదురు చూసుడు ఇక తప్పినట్టే. నిరుపేదల గురించి ఆలోచించే కేసీఆర్ సారుకు మేము ఎప్పుడు అండగా ఉంటుంది.

**– అక్కనపల్లి తిరుమల, గృహిణి, స్టేషన్ ఘన్‌పూర్**

## నాకు కేసీఆరే దిక్కు

పాలకుర్తి : నా భర్త 20 ఏండ్ల కింద నా ముగ్గురు కొడుకులు వేర్వేరు కారణాలతో సచ్చిపోయింండ్రు.. నాకు ఇల్లు లేదు. బతుకు మీద ఆశ లేకుండా పోయింది. భూమి మీద ఎందుకు బతకాలని ఆనుకున్న తరుణంలో దేవుడి లాంటి కేసీఆర్ పెద్ద దిక్కుగా నిలిచిండు.. పెద్ద కొడుకు అయ్యాడు. నాకు వచ్చే పింఛన్‌తో బతుకుతున్న. నెలకు వచ్చిన బియ్యంతో కడుపు నింపుకుంటున్నా. కేసీఆర్ ఇచ్చిన పింఛన్ లేకుంటే నేను బతకడం కష్టం. దిక్కు మొక్కు లేని నాకు కేసీఆర్ సార్ దయ వల్ల బతుకుతున్న. మళ్లీ సారే గెలవాలి.

**– కోట పుల్లమ్మ, పాలకుర్తి**

## సీఎం కేసీఆర్ సార్ దేవుడు..



పాలకుర్తి : మాలాంటి ముసలోళ్లను ఆదుకుని నెల నెలకు పింఛన్ ఇస్తున్న దేవుడు సీఎం కేసీఆర్ సార్. మాలాంటి వాళ్లకు జీవనం గడిపేందుకు సహాయం చేస్తుండు. వచ్చిన డబ్బులు మందులకు, ఇంటి ఖర్చులకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి.సార్ పైసలు ఇవ్వక పోతే మా పరిస్థితి గోరంగా ఉండేది. ఇంటికి పెద్ద కొడుకగా వచ్చి ప్రతి నెల మాకుపింఛన్ డబ్బులు పంపిస్తున్నారు. ఇప్పుడు ఫించన్ డబ్బులు ఎక్కువ చేసి అందించడం ఇంకా సంతోషకంగా ఉంది.

**– కమ్మగాని రాజమ్మ, పాలకుర్తి**

## సాయం మరువలేం..



పాలకుర్తి : దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నది. రూ3,016ల నుంచి రూ4,016లు పింఛన్ ఇచ్చిమా ఆకలి తీరుస్తున్నరు. సమైక్య రాష్ట్రంలో దివ్యాంగులను పట్టించుకోలేదు. కేసీఆర్ సార్ అచ్చినంక మాకు గౌరవం పెరిగింది. పింఛన్ రాకుంటే మా పరిస్థితి దారుణంగా ఉండేది. రేషన్ బియ్యం అత్తన్నయ్.. మేము సార్ దయ వల్ల మంచిగ ఉంటున్నం.. మళ్లీ రూ.6 వేలు అందిస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది.

**– రావుల సత్యనారాయణ, మల్లంపెల్లి, టీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు**

## దివ్యాంగుల జీవితాల్లో వెలుగు

పాలకుర్తి : సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ మేనిఫెస్టోతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయి. ఇప్పటికే మా జీవితాల్లో మనోధైర్యం నింపారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతో సమాజంలో మాకు సముచిత స్థానం కలగనుంది. దివ్యాంగులకు రూ.6016 పింఛన్ రావడంతో ఆర్థికంగా బాగుపడతారు. కుటుంబంలోనూ దివ్యాంగులకు గౌరవం పెరుగుతది. ఖర్చులు పోను డబ్బులు కూడా మిగులుతాయి.

**– బీరెల్లి నర్సయ్య, దివ్యాంగుడు, శాతాపురం**